సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



నష్టం మిగిల్చిన వర్షం..
జిల్లాలో అకాల వర్షంతో పంటలు దెబ్బతిన్నాయి. వరి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలకు నష్టం కలిగింది. 8లో



నవమికి ప్రత్యేక బస్సులు..
శ్రీ రామనవమి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భద్రాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. 8లో

గరిష్టం / కనిష్టం
38° / 24°

వాతావరణం
జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. వాతావరణం చల్లగా ఉండే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరో రోజు ఆలయంలో అర్చకులు అమ్మవారికి 108 సువర్ణపుష్పాలతో పూజలు నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో శుక్రవారం వసంత మహోత్సవాలను పురస్కరించుకుని నాదానీరాజనం, సూక్తి పారాయణ, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీచక్రార్చన, లక్ష కుసుమార్చన, శ్రీలలితా సహస్రనామహవనం జరిపారు. అమ్మవారికి హారతి ఇచ్చి మంత్రపుష్పాన్ని సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ముగిసిన కుష్ఠు బాధితుల గుర్తింపు సర్వే

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో ముగిసిన కుష్ఠు వ్యాధి బాధితుల గుర్తింపు సర్వే ముగిసిందని డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 17 నుంచి 30వ తేదీ వరకు వ్యాధి గ్రస్తుల గుర్తింపు సర్వే నిర్వహించామని, శుక్రవారంతో ఆన్‌లైన్ ప్రక్రియ కూడా ముగిసిందని పేర్కొన్నారు. సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ సర్వే నిర్వహించారని పేర్కొన్నారు. సర్వేలో 1,702 మందిని అనుమానిత లక్షణాలు ఉన్న వారిగా గుర్తించామని తెలిపారు. 2,88,368 ఇళ్లను సందర్శించి 12,13,576 మందిని పరీక్షించామని, మొత్తం ఐదు కొత్త కేసులను గుర్తించామని వివరించారు. ప్రారంభ దశలో గుర్తించి చికిత్స పొందితే వ్యాధి పూర్తిగా నయమవుతుందని తెలిపారు. వ్యాధి కారక క్రిమి శరీరంలోకి ప్రవేశించాక లక్షణాలు బయటపడడానికి రెండు నుంచి ఐదు సంవత్సరాల వరకు సమయం పట్టే అవకాశం ఉంటుందని వివరించారు.

టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ కోర్సుల్లో శిక్షణ

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్రంలోని హైదరాబాద్, హన్మకొండ, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్‌లలో మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు టెక్నికల్ టీచర్ ట్రైనింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతితో పాటు లోయర్ గ్రేడ్ టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణత సాధించినవారు శిక్షణకు అర్హులని, ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకుని అడ్మిట్ కార్డు పొందాలని వివరించారు. అడ్మిషన్లు ఈ నెల 17 నుంచి 29వ తేదీ వరకు జరుగుతాయని, పూర్తి వివరాలకు 99890 27943 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

7న మ్యాథ్స్, సైన్స్ క్విజ్ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: మ్యాథ్స్ అండ్ సైన్స్ సర్కిల్స్ కార్యక్రమాల్లో భాగంగా 8, 9 తరగతుల విద్యార్థులకు జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష కొత్తగూడెంలోని జిల్లా విద్యాశిక్షణా కేంద్రంలో జరుగుతుందని, 8, 9 తరగతుల విద్యార్థులకు వేర్వేరుగా పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామని, అన్ని పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరుకావాలని తెలిపారు. పాల్గొనే విద్యార్థుల వివరాలు జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్‌కు అందించాలని కోరారు.

నేడు ఐజీ పర్యటన

కొత్తగూడెంటౌన్: జిల్లాలో శనివారం మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి పర్యటించనున్నారు. లక్ష్మీదేవిపల్లి మండలంలోని హేమచంద్రాపురం హెడ్ క్వార్టర్స్‌లో విలేకరులతో సమావేశం కానున్నారని ఎస్పీ రోహిత్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కమనీయం... శ్రీవారి కల్యాణం

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీవేంకటేశ్వరస్వామి సమేత అలివేలు మంగ, పద్మావతి అమ్మవార్ల కల్యాణం జరిపించారు. ఇటీవల నిర్మించిన వకుళామాత స్టేడియానికి శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తోడ్కొని వచ్చిన అర్చకులు పట్టువస్త్రాలతో అలంకరించాక కల్యాణ క్రతువు ఆరంభించారు. ఈక్రమాన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయం నుంచి తీసుకొచ్చిన ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలను ఆలయ ఈవో జగన్మోహన్‌రావు దంపతులు సమర్పించారు.

ఆ భూములు వస్తే..



ఏపీలోని దేవస్థానం భూముల్లో ఉన్న గోశాల ముఖద్వారం(ఫైల్)

స్వయం సమృద్ధి సాధించనున్న భద్రాచలం రామాలయం

- స్వామివారికి ఏపీలోని పురుషోత్తపట్నంలో 889 ఎకరాలు
- వివాదంలో నలుగుతున్న ఏపీ పరిధిలోని ఆలయ ఆస్తులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్ర విభజనతో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ భూముల్లో అధిక భాగం ఏపీలో పరిధిలోకి వెళ్లాయి. ప్రస్తుతం ఏపీలోని ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో సీతారామచంద్రస్వామి ఆలయానికి చెందిన భూములు ఏకంగా 889.50 ఎకరాలు ఉన్నాయి. ఇప్పుడీ భూములు ఆలయ నిర్వహణలో కీలకంగా మారాయి.

వివాదంలో ఆలయ భూములు

భద్రాచలం పట్టణానికి సమీపంలో దాదాపు తొమ్మిది వందల ఎకరాల స్థలాలు ఏపీలోని పురుషోత్తపట్నంలో ఉన్నాయి. ఇందులో కొంతభాగం దేవస్థానం ఆధీనంలో ఉండగా, అత్యధిక భూభాగం స్థానిక రైతులతోపాటు కొందరు వ్యక్తుల ఆధీనంలో ఉంది. ఆలయానికి సంబంధించిన భూముల్లో వివిధ పంటలతోపాటు జామాయిల్ సాగు చేస్తున్నారు. ఈ భూములు తమవేనని స్థానిక రైతులు పేర్కొంటుండగా గత కొద్ది సంవత్సరాలుగా వివాదం నడుస్తోంది. ఆలయ అధికారులు పలుమార్లు ఈ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తే స్థానికుల నుంచి వ్యతిరేకత వచ్చింది. ప్రస్తుతం ఈ అంశం రెండు రాష్ట్రాల మధ్య సమస్యగా మారింది. ఇరు రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పరిష్కరిస్తే వందల ఎకరాలు రామాలయ ఆధీనంలోకి వస్తాయి.

నిత్యావసరాలు బయటి నుంచే..

నిత్యం భద్రాచలం ఆలయంలో మూలమూర్తులు, ఉత్సవ విగ్రహాలకు పూజలు చేసేందుకు ఆలయాన్ని అలంకరించేందుకు భారీగా పుష్పాలను కొనుగోలు చేస్తున్నారు. వీటితోపాటు సీతారాములకు నైవేద్యం సమర్పించడంతోపాటు ప్రసాదాల తయారీలో పాలు, పెరుగు, నెయ్యి, వెన్నలను ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం దేవస్థానం ఆధీనంలో నడుస్తున్న గోశాల ఆలయ అవసరాలను తీర్చలేకపోతోంది. దీంతో బయటి నుంచి వీటిని కొనాల్సి వస్తోంది. దీనికి తోడు పోకల దమ్మక్క నిత్యాన్నదాన సత్రంలో రోజూ భారీగా కూరగాయలు అవసరం పడుతున్నాయి. పూలు, పాలు, నెయ్యి, కూరగాయల కోసమే ఏటా దాదాపు రూ. 2 కోట్ల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది.

వేదపాఠశాల నిర్మించే యోచన..

పురుషోత్తపట్నంలోని భూములు ఆలయ పరిధిలోకి వస్తే పూల మొక్కలు, పాడి ఆవులు, తులసీ వనాలకు సరిపడా స్థలం కేటాయించగా మిగిలిన స్థలంలో వేదపాఠశాలను నిర్మించే యోచనలో దేవస్థానం అధికారులు ఉన్నారు. ఆలయానికి అనుబంధంగా ఇక్కడ సామాన్య భక్తుల కోసం సత్రాలు నిర్మించే ఆలోచన కూడా చేస్తున్నారు. ఇప్పటికే సత్రాలు నిర్మించేందుకు ముప్పై మందికి పైగా డోనర్లు సంసిద్ధత వ్యక్తం చేశారు. టీటీడీ సైతం సుముఖంగా ఉంది. కేవలం స్థల లభ్యత కారణంగా కొత్త సత్రాలు అందుబాటులోకి రాలేదు. భద్రాచలం నుంచి కేవలం 2.5 కి.మీ దూరమే ఉండటంతో ఇక్కడ సత్రాలు నిర్మించినా భక్తులకు పెద్దగా ఇబ్బంది ఉండదు. పైగా ఆలయ భూములకు పరిరక్షణగా ఈ నిర్మాణాలు ఉపయోపడతాయనే భావన ఉంది.

తిరుమల తిరుపతి తరహాలో..

ప్రపంచ ప్రసిద్ధి చెందిన తిరుపతి తిరుమల దేవస్థానం ఆధీనంలో పూల తోటలు, పాడి ఆవులు, తులసీ వనాలు పెంచుతున్నారు. వీటికి సమీపంలోనూ కూరగాయలు సాగు చేస్తున్నారు. పూర్తిగా ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా అక్కడ మొక్కల పెంపకం, సాగు జరుగుతోంది. పురుషోత్తపట్నంలో ఉన్న భూములు అందుబాటులోకి వస్తే తిరుమల తిరుపతి దేవస్థానం తరహాలో ఆలయానికి అవసరమైన పుష్పాలు, కూరగాయలు, పాల ఉత్పత్తులు వచ్చేలా సాగు చేసుకునే వీలుంది. శుభకార్యాలకు అవసరమైన రీతిలో ఇక్కడ అరటిసాగు చేయాలనే ఆలోచన సైతం చేస్తున్నారు.

స్థానికులకే ఇస్తాం



సీతారామచంద్రస్వామి ఆలయానికి అనుబంధంగా పదకొండు వందల ఎకరాల భూములు ఇరు తెలుగు రాష్ట్రాల్లో ఉన్నాయి. ఇందులో పురుషోత్తపట్నంలో ఉన్న 889.50 ఎకరాల ఆలయ భూములపై న్యాయపోరాటం జరుగుతోంది. అవి రామాలయ ఆధీనంలోకి రాగానే, ఆలయ అవసరాలకు అనుగుణమైన పంటలు వేయిస్తూ స్థానిక రైతులకే సాగు బాధ్యతలు అప్పగించే ఆలోచనలో ఉన్నాం. స్థానికంగా ఖాళీగా ఉన్న కొద్దిపాటి దేవస్థానం భూములలో సైతం భక్తులకు అవసరమైన డార్మెటరీ గదులను నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

–ఎల్.రమాదేవి, రామాలయ ఈఓ

వానాకాలంలో 6,03,124 ఎకరాల్లో సాగు



వరి నాటు వేస్తున్న కూలీలు(ఫైల్)

వచ్చే సీజన్‌పై అంచనా వేసిన వ్యవసాయ శాఖ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో రాబోయే వానాకాలం పంటల విస్తీర్ణాన్ని వ్యవసాయశాఖ అంచనా వేసింది. గత వానాకాలం సీజన్ కంటే ఈసారి పంటల విస్తీర్ణం స్వల్పంగా పెరగనుంది. గత వానాకాలంలో 5,92,264 ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటలను రైతులు సాగు చేయగా వచ్చే వానాకాలంలో 6,03,124 ఎకరాలు సాగు చేయనున్నట్లు వ్యవసాయశాఖ పేర్కొంది. ఎప్పటిలాగే వరి, మొక్కజొన్న, పత్తి, ఆయిల్‌పామ్ పంటల విస్తీర్ణం అధికంగా ఉంది. కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ప్రోత్సాహంతో గతేడాది 550 ఎకరాల్లో మునగ సాగు చేయగా, ఈసారి 2,500 ఎకరాలకు చేరుకోనుంది.

గత, రానున్న వానాకాలం సీజన్లలో పంటల విస్తీర్ణం వివరాలు..

పంట	గత సీజన్	రానున్న సీజన్
ఆగ్రో ఫారెస్ట్రీ	28,414	28,982
వరి	1,64,663	1,60,956
మొక్కజొన్న	85,828	85,544
పత్తి	2,03,561	2,04,632
వేరుశెనగ	2,736	2,791
పండ్ల మొక్కలు	9,995	10,195
జీడిపప్పు	11,670	11,903
కోకోవ	640	652
కొబ్బరి	1,769	1,805
ఆయిల్‌పామ్	63,486	75,000
మినుము	840	857
పెసర	128	131
కంది	1,136	1,159
మిర్చి	10,284	10,489
కూరగాయలు	492	501
ఇతర పంటలు	6,073	5,025
మునగ	550	2,500
మొత్తం	5,92,264	6,03,124

మునగ సాగు పెరిగే అవకాశం

కలెక్టర్ ప్రోత్సాహంతో జిల్లాలో వచ్చే వానాకాలంలో మునగసాగు పెరగనుంది. గత సంవత్సరం మునగసాగు కంటే మరో నాలుగురెట్లు ఎక్కువగా సాగయ్యే అవకాశం ఉంది. లాభదాయకమైన పంట కావడంతో రైతులు మక్కువ చూపుతున్నారు.

–వి.బాబూరావు, జిల్లా వ్యవసాయాధికారి

'పెదవాగు' ఆనకట్టకు మట్టి పరీక్షలు



పెదవాగు ప్రాజెక్టు ఆనకట్ట వద్ద యంత్రం సాయంతో మట్టి సేకరిస్తున్న సిబ్బంది

అశ్వారావుపేటరూరల్: పెదవాగు ప్రాజెక్ట్ ఆనకట్టకు స్థానిక నీటి పారుదల శాఖ అధికారుల పర్యవేక్షణలో శుక్రవారం మట్టి(సాయిల్) పరీక్షలు చేశారు. గతేడాది జూలై 18న కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా మండల పరిధిలోని గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు గండ్లు పడిన సంగతి తెలిసిందే. ప్రాజెక్ట్ తిరిగి నిర్మించేందుకు నీటిపారుదల శాఖ రూ.90 కోట్ల వ్యయంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో రూ.40 కోట్ల నిధులను కేటాయించారు. ప్రాజెక్టు రీడిజైన్ ప్రకారంలో ఇప్పుడు ఉన్న మూడు గేట్లతోపాటు అదనంగా మరో ఐదు గేట్లతో నిర్మించేలా ప్రతిపాదించారు. దీంతో అదనపు గేట్ల నిర్మాణానికి ఆనకట్ట వద్ద అనువుగా ఉందా.? లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు మట్టి పరీక్షలు చేపట్టారు. యంత్రాల సాయంతో భూగర్భంలో నుంచి మట్టి బయటకు తీస్తున్నారు. ఇలా సేకరించిన మట్టి హైదరాబాద్‌లోని పరీక్షా కేంద్రానికి పంపిస్తామని, అక్కడి నుంచి వచ్చే నివేదిక ప్రకారం ముందుకెళ్తామని స్థానిక నీటి పారుదల శాఖ ఏఈఈ శ్రీనివాస్ తెలిపారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు, పండితులు

- నేడు కల్యాణంలో కీలక ఘట్టమైన ఎదుర్కోలు ఉత్సవం
- తానీషాను స్మరిస్తూ భక్తులపై గులాల్ చల్లే విశేషం
- రేపు సీతారాముల కల్యాణం, 7న పట్టాభిషేకం

భద్రాచలం: భద్రగిరి శ్రీసీతారామ చంద్రస్వామివారి నవాహ్నిక తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ధ్వజారోహణాన్ని వైభవోపేతంగా జరిపారు. శ్రీ మహా విష్ణువుకి ప్రీతిపాత్రుడైన గరుత్మంతుని పటాన్ని ధ్వజస్తంభం పై ఎగురవేశారు. గరుడాధివాసం కార్యక్రమాన్ని కమనీయంగా జరిపారు. ఉదయం యాగశాలలో తిరువారాధన సేవాకాలం, నివేదన, మంగళ శాసనం, తీర్థప్రసాద వినియోగం నిర్వహించారు. అనంతరం ఎటువంటి విఘ్నాలూ కలుగకుండా ఉండడానికి సేనాధిపతి, విఘ్ననాశకుడు అయిన విశ్వక్సేనుడికి అర్చన జరిపి, కర్మణ, పుణ్యావాచనం, మూర్తి కుంభావాహన, భద్రక మండల ఆరాధన, ద్వార తోరణ ఆరాధన జరిపి నవాహ్నిక దీక్షకు అగ్ని ప్రతిష్ఠాపన జరిపారు.



గరుడ ప్రసాదం పంపిణీ

యాగశాల నుంచి గరుడ పటాన్ని ఆలయం చుట్టూ ప్రదక్షిణలతో అర్చక పరిచారక వేద పండితులు తీసుకుని రాగా బ్రహ్మోత్సవ రక్షణ నిమిత్తం గరుడాళ్వారులను ఆహ్వానించి ఆరాధన చేశారు. గరుడ మహా సంకల్పం, గరుడ గద్యనం, గరుడ మంగళాష్టకాలను తర్పానందంగా ప్రధానార్చకులు చదవగా గరుడ పటాన్ని మంగళ వాయిద్య ఘోష నడుమ ధ్వజారోహణం చేశారు. అనంతరం బలిహరణం జరిగింది. సంతానం లేనివారికి గరుడ ముద్దలను ప్రసాదంగా అందజేశారు. గరుడ ముద్ద తీసుకున్న వారికి సంతానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. సాయంత్రం యాగశాలలో భేరీ పూజ నిర్వహించారు.

నేడు ఎదుర్కోలు ఉత్సవం

సీతారాముల కల్యాణ వేడుకలకు ముందు వధూవరుల విశిష్టతలను వర్ణించే, గొప్పలను వివరించే ఎదుర్కోలు ఉత్సవం శనివారం సాయంత్రం నిర్వహించనున్నారు. వేడుకల్లో హిందూ, ముస్లింల సామరస్యాన్ని పెంపొందించేలా భక్తులందరిపై పన్నీరు, గులాల్ చల్లుతారు. భద్రాచలం దేవస్థానంలో గోల్కొండ నవాబైన తానీషాను స్మరింపజేస్తూ ఈ సంప్రదాయాన్ని ఇప్పటికీ జరపటం విశేషం. నవాహ్నిక తిరుకల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, సోమవారం పట్టాభిషేక మహోత్సవం జరపనున్నారు. పూజాది కార్యక్రమాల్లో ఆలయ ఈఓ ఎల్.రమాదేవి దంపతులు, ఏఈవోలు శ్రవణ్‌కుమార్, భవాని రామకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకుడు విజయరాఘవన్, స్థానాచార్యులు కేశ స్థలశాయి, వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్ణశాలలో..

దుమ్ముగూడెం: పర్ణశాలలో శుక్రవారం ఘనంగా ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ, మూర్తికుంభ ఆవాహన, ధ్వజారోహణం, మహా నివేదన తీర్థప్రసాద గోష్ఠి జరిపారు. గరుడ ప్రసాద వితరణ చేశారు. ఆలయ ఇన్‌చార్జ్ అనిల్ కుమార్, అర్చకులు ప్రతాపురం భార్గవాచార్యులు, కారంపూడి కిరణ్‌కుమారాచార్యులు, వెంకటాచార్యులు, భరద్వాజాచార్యులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అర్చకులు

రామయ్యకు ఇత్తడి గొడుగుల బహుకరణ



స్వామివారి సేవకు వినియోగిస్తున్న ఇత్తడి గొడుగులు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామ చంద్రస్వామివారికి ఓ భక్తుడు ఇత్తడి గొడుగులను శుక్రవారం బహూకరించారు. అమెరికాలో స్థిరపడిన బుర్ర అరుణ్–రత్నబాల దంపతులు సుమారు రూ.1,15,000 విలువైన రెండు ఇత్తడి గొడుగులను ఆలయ అధికారులకు అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలంటౌన్: రామాలయంలో నిత్యాన్నదాన కార్యక్రమానికి శుక్రవారం భద్రాచలం పట్టణానికి చెందిన మల్లెల వెంకట శ్రీనివాస్–పార్వతి దంపతులు రూ.1,01,116 లక్ష, బీవీ సీతారామరాజు–కృష్ణవేణి దంపతులు రూ.50 వేలు విరాళం అందించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

18 ప్రాథమిక చికిత్స కేంద్రాలు..

కొత్తగూడెంఅర్బన్: శ్రీరామనవమి సందర్భంగా భక్తులకు వైద్య సేవలందించేందుకు జిల్లా వ్యాప్తంగా 18 ప్రాథమిక చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ ఎల్.భాస్కర్‌నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 మంది వైద్యులు, 217 మంది పారా మెడికల్ సిబ్బందిని నియమించామని, శనివారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు సేవలు కొనసాగుతాయని పేర్కొన్నారు. 5 అంబులెన్స్‌లు, సీపీఆర్ క్వాలిఫైడ్ ఎంఎల్‌హెచ్‌పీఎస్‌ను నియమించామని, ఏరియా ఆస్పత్రుల్లో 50 బెడ్లు, ప్రతి ప్రైవేటు నర్సింగ్ హోంలలో 5 బెడ్లు, అన్ని రకాల గ్రూప్‌ల రక్తం అందుబాటులో ఉంచామని వివరించారు.

రేపటి నుంచి పునర్వసు దీక్షలు

భద్రాచలంటౌన్: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో చైత్రమాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీ సాయంత్రం నుంచి శ్రీరామ పునర్వసు దీక్షలు ప్రారంభిస్తామని ఆలయ ఈఓ ఎల్.రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పునర్వసు దీక్ష విరమణ, భద్రగిరి ప్రదక్షిణ మే 3న నిర్వహిస్తామని పేర్కొన్నారు. శ్రీరామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీరామ పునర్వసు దీక్షాధారణ చేయాలని కోరారు.

నవమికి ముస్తాబైన దర్గా



దర్గా ప్రాంగణంలో కొలువుదీరిన సీతారాములు

ఇల్లెందురూరల్: సీతారాముల కల్యాణం, మహాపట్టాభిషేకం వేడుకలకు మండలంలోని హజరత్ నాగుల్‌మీరా దర్గా ముస్తాబైంది. దర్గాలో పద్నాలుగేళ్లుగా ఈ వేడుకలను నిర్వహిస్తుండగా, ఏటా హిందూ ముస్లిం భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. ఈ ఏడాది కూడా దర్గాలో వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు దర్గా కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. శనివారం దమ్మక్క వారసుల చేత గోటితో ఒలిచిన తలంబ్రాలను దర్గాలో సమర్పించనున్నారు. 6న కల్యాణం, 7న పట్టాభిషేకం నిర్వహించనున్నారు.

సమన్వయంతో పనిచేయాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

భద్రాచలం: శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణం, పట్టాభిషేకం మహోత్సవాల్లో అధికారులందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు సూచించారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వేడుకల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రామయ్య కల్యాణానికి సీఎం రేవంత్ రెడి రానున్న నేపథ్యంలో అధికారులు, సిబ్బంది శనివారం నుంచే విధుల్లో ఉండాలని ఆదేశించారు. వీఐపీ, వీవీఐపీలు, భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు.


సకలం సిద్ధం

స్వామివారి తలంబ్రాల పంపిణీకి 80, ప్రసాదాల పంపిణీకి 19 ప్రత్యేక కౌంటర్లు, 13 మెడికల్ క్యాంపులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కల్యాణ మండపాన్ని 26 సెక్టార్లుగా విభజించి ప్రతి సెక్టార్‌కు ప్రత్యేక అధికారులను, పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. రోజూ లక్షన్నర లడ్డూలను భక్తులకు అందిస్తామని, 200 క్వింటాళ్ల తలంబ్రాలను సిద్ధం చేశామని వివరించారు. రెండు రోజులపాటు భద్రాచలం, సారపాకలలో ఉన్న వైన్ షాపులను మూయించాలన్నారు. అనంతరం మిథిలా స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించి పలు సలహాలు, సూచనలను అందించారు.

అధికారులపై మంత్రి ఆగ్రహం

కూనవరం రోడ్డులో కరకట్ట నిర్మాణ పనుల్లో ఆలస్యంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కరకట్ట పనులను పరిశీలించి మాట్లాడారు. మే 31 నాటికి పనులు పూర్తి చేయాలన్నారు. అటవీ అభివృద్ధి సహకార సంస్థ చైర్మన్ పోదెం వీరయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ బి.రాహుల్, ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, ఆర్డీఓ దామోదర్ రావు, ఈఓ రమాదేవి పాల్గొన్నారు.

భక్తుల మన్ననలు పొందాలి



ఆలయంలో అధికారులు, అర్చకులతో మాట్లాడుతున్న కలెక్టర్

భద్రాచలంటౌన్: శ్రీ సీతారామచంద్ర స్వామివారి కల్యాణం, పట్టాభిషేకం మహోత్సవాల్లో సక్రమంగా విధులు నిర్వహించి భక్తుల మన్ననలు పొందాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. లైజన్, సెక్టోరియల్ అధికారులతోపాటు వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు, చిన్నపిల్లలు, మహిళలు, సీనియర్ సిటిజన్లను, అనారోగ్యంతో ఉన్న వారి పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భక్తులు అస్వస్థతకు గురైతే సమీపంలోని వైద్య శిబిరానికి తరలించాలన్నారు. విధుల్లో సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తర్వాత కలెక్టర్ రామయ్య స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఐటీడీఏ పీవో బి. రాహుల్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్‌డీఓ విద్యాచందన, ఆర్డీఓ దామోదర్ రావు, ఈఓ ఎల్.రమాదేవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియాలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి 13 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. ఏరియాలోని జేవీఆర్ఓసీ–2లో 10 వేల టన్నులు, కిష్టారం ఓసీలో 3 వేల టన్నులతోపాటు కిష్టారం ఓసీలో 1500 క్యూబిక్ మీటర్ల ఓబీ, జేవీఆర్ఓసీ–2లో 50 వేల క్యూబిక్ మీటర్ల ఓబీకి అంతరాయం వాటిల్లింది.

ఎన్డీ జిల్లా కార్యదర్శి రమేశ్ విడుదల

ఇల్లెందు: సీపీఐ (ఎంఎల్) ఎన్డీ జిల్లా కార్యదర్శి, ఇల్లెందు మండలం మర్రిగూడెం పంచాయతీ ఎల్లాపురం గ్రామానికి చెందిన పూనెం బాబు అలియాస్ రమేశ్ శుక్రవారం ఖమ్మం జైలు నుంచి విడుదలై ఇంటికి చేరారు. గత నవంబర్ 28న ఆయన్ను ఇంటి వద్ద గుండాల పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. 20 ఏళ్లుగా ఉద్యమంలో, ముఖ్యంగా అజ్ఞాతంలో ఉన్న రమేశ్ పలు దఫాలు జైలు జీవితం గడిపారు. లింగన్న ఎన్కౌంటర్ తర్వాత ఎన్డీ దళాలు క్రమక్రమంగా తుడిచి పెట్టుకుపోయాయి. అయినా రమేశ్ మాత్రం అజ్ఞాతం వీడలేదు. అనారోగ్యంతో ఇంటికి చేరిన ఆయన పోలీసులకు చిక్కి నాలుగు నెలల నాలుగు రోజులు ఖమ్మం జైలులో గడిపారు. ఆయనపై ఇల్లెందు, బోడు, ఆళ్లపల్లి, గుండాల పోలీస్ స్టేషన్లలో ఆరు కేసులున్నాయి. ఎన్డీ నేతలు పొడుగు నర్సింహారావు, టి.నాగేశ్వరరావు స్వాగతం పలికారు.

వచ్చే నెల 19న ఆత్మలింగేశ్వరాలయం ప్రతిష్ఠాపన



కరపత్రాలతో ధర్మకర్త శ్రీనివాసరావు, తదితరులు

పాల్వంచ: పాల్వంచలోని చింతలచెర్వు వద్ద ఉన్న ప్రాచీన ప్రముఖ శ్రీ ఆత్మలింగేశ్వర స్వామి దేవాలయంలో మే 15 నుంచి 19వ తేదీ వరకు జీర్ణోద్ధరణ పూర్వక ప్రతిష్ఠా మహాకుంభాభిషేక మహోత్సవాలు జరగనున్నాయి. ఈ మేరకు కార్యక్రమాల కరపత్రాలను శుక్రవారం విడుదలచేసిన ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు మాట్లాడారు. కాకతీయుల పరిపాలనలో ప్రతాపరుద్రుడి హయాంలో ఈ ఆలయాన్ని నిర్మించారని తెలిపారు. ప్రతిష్ఠాపనకు కాకతీయ వారసుడు కమల్చంద్భంజ్దేవ్, పాల్వంచ సంస్థానాధీశుల వారసులు కృష్ణకుమార్ అప్పారావు అశ్వరాయ, మధుకుమార్ అప్పారావు అశ్వరాయ, అశ్వారావుపేట పరగణాధిపతుల వారసులు దామెర కుమారమురళి మహిపాల్ తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. వచ్చేనెల 19వ తేదీన ఆదిశంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతీ మహాస్వామి చేతుల మీదుగా యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం ఉంటాయని తెలిపారు. సమావేశంలో యల్లావులు కోటేశ్వరరావు, యల్లావుల వెంకన్న, వల్లపు యాకయ్య, రమణ, ఫణి, సాంబయ్య, అచ్యుత్ రావు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో ఆదివారం జరగనున్న శ్రీసీతారాముల కల్యాణోత్సవానికి ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్కల్యాణ్ హాజరుకానున్నట్లు సమాచారం. ఈ మేరకు ఏపీ అధికారుల నుంచి భద్రాచలం అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. పవన్కల్యాణ్ శనివారం సాయంత్రమే భద్రాచలం చేరుకునే అవకాశముందని, ఆదివారం ఉదయం కల్యాణాన్ని తిలకించాక తిరిగి వెళ్తారని సమాచారం. అంతేకాక పలువురు కేంద్ర మంత్రులు, టీటీడీ చైర్మన్ బీఆర్.నాయుడు కూడా భద్రాచలం రానున్నట్లు తెలిసింది.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి

పాల్వంచ: మద్యం మత్తులో డ్రెయినేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందడంతో పాల్వంచ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని సంజయ్నగర్కు చెందిన కొంపెల్లి వెంకటేశ్వర్లు (55) గురువారం రాత్రి మద్యం సేవించాడు. అనంతరం ఇంటికి నడుచుకుంటూ వెళ్తున్న క్రమంలో డ్రెయినేజీలో పడ్డాడు. వర్షం వల్ల డ్రెయినేజీ పొంగింది. వెంకటేశ్వర్లు బయటకు రాలేక మృతి చెందాడు. స్థానికులు కొంత సేపటి తర్వాత గుర్తించి, బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతిపై అనుమానాలు ఉన్నాయని భార్య స్వరూప శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలున్నారు.

మున్సిపాలిటీ నిర్లక్ష్యం వల్లే మృతి

నవభారత్ వైన్స్ సమీపంలో డ్రెయినేజీ ఓపెన్ చేసి ఉండటంతో రాత్రి వేళ కనిపించక వెంకటేశ్వర్లు అందులో పడి మృతి చెందాడని, ఇది మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం వల్లే జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. డ్రెయినేజీ శుభ్రం చేసేందుకు పైకప్పును సిబ్బంది పగులగొట్టారని, అనంతరం అలానే వదిలేశారని, ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదనే విమర్శలు వస్తున్నాయి.

నష్టం మిగిల్చిన వర్షం..

అనుకోని వర్షం అన్ని పంటలను దెబ్బకొట్టింది.. మండే వేసవిలో కురిసిన అకాల వర్షం అపార నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం శ్రమించి.. ఇక పంట చేతికొస్తుందనుకున్న రైతుల ఆశలపై నీళ్లు కుమ్మరించింది. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. చెప్పా పెట్టకుండా వచ్చిన వాన అన్నదాతల కంట కన్నీళ్ల వరదలు పారించింది.





ఇల్లెందురూరల్: కొమరారం కల్లంలో తడిసిన మొక్కజొన్న గింజలను ఆరబెడుతున్న రైతులు (ఇన్సెట్) మిర్చి కల్లంను చుట్టుముట్టిన వరదనీరు

ఇల్లెందులో..

ఇల్లెందురూరల్: అకాల వర్షానికి మండలంలో మొక్కజొన్న పంట సుమారు 300 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు సమాచారం. పూబెల్లిలో కల్లంలో ఆరబెట్టిన మొక్కజొన్న తడిసిపోవడంతో మహిళా రైతు కల్తీ కోటమ్మ చేలోనే సొమ్మసిల్లి పడిపోయింది. ఐదెకరాల్లో సాగు చేసిన మొక్కజొన్న నూర్పిడి చేసి కల్లంలో ఆరబెట్టింది. గురువారం వాహనం దొరక్కపోవడంతో తీసుకెళ్లకపోవడంతో.. భారీ వర్షం నట్టేట ముంచింది. శుక్రవారం ఉదయం చేనుకు వెళ్లిన ఆమె తడిసిన పంటను చూసి అక్కడే కుప్పకూలింది. సమీప రైతులు గమనించి ఇంటికి చేర్చారు. కల్లాల్లో ఆరబెట్టిన మిర్చి కూడా కూడా తడిసిపోయింది. ఏడీఏ లాల్చంద్, ఏఓ సతీశ్ గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. సీపీఎం నాయకులు అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, వజ్జ సురేశ్ కూడా పంటలను పరిశీలించారు.

పాల్వంచరూరల్: వర్షానికి నేలవాలిన వరి పంట



పాల్వంచ మండలంలో..

పాల్వంచరూరల్: మండలంలోని కోడిపుంజుల వాగులో తేజావత్ కీమా మిర్చి తడిసి ముద్దయింది. నారాయణరావుపేటలో దాసరి మస్తాన్రావుకు చెందిన ఎనిమిది ఎకరాలు, అప్పాజు సత్యనారాయణకు చెందిన ఆరు ఎకరాలు, వెంకట్రావుకు చెందిన 3 ఎకరాల వరి పంట నేలవాలింది. నాగారం, దంతలబోరు, సోములగూడెం, రంగాపురం గ్రామాల్లో వరి దెబ్బతిన్నది. ఏఓ శంకర్ రంగాపురంలో వరి పంటలను పరిశీలించారు.



పాల్వంచరూలర్: కోడిపుంజులవాగులో తడిసిన మిర్చిని ఆరబెడుతున్న రైతులు

జూలూరుపాడు: వినోభానగర్లో నేలవాలిన వరి పంటను చూపిస్తున్న రైతు



జూలూరుపాడులో..

జూలూరుపాడు: మండలంలో కురిసిన అకాల వర్షంతో మొక్కజొన్న, మిరప, వరి పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. జూలూరుపాడు - పాపకొల్లు గ్రామాల మధ్య రోడ్డు విస్తరణ పనుల కారణంగా జూలూరుపాడు కోయకాలనీ వద్ద రహదారిపై వరద నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు.

పినపాక: వెంకట్రావుపేటలో పట్టాలపై నిలిచిన నీటిని మోటార్లతో ఎత్తిపోస్తున్న రైతు



పినపాక: గురువారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని పలు గ్రామాల్లో మిర్చి తడిసిపోయింది. వెంకటరావుపేటలో పొన్నగంటి రాంబాబు తన తోటలో ఆరబోసిన మిర్చి మొత్తం తడిసింది. పాత రెడ్డిపాలెం, ఈ–బయ్యారం, జానంపేట గ్రామాల్లో వరి, మిర్చి పంటలు దెబ్బతిన్నాయి.



పినపాక: పాత రెడ్డిపాలెంలో పట్టాలపై ఉన్న నీటిని తొలగిస్తున్న రైతులు



టేకులపల్లి: మిర్చిపై టార్పాలిన్లు కప్పిన దృశ్యం

టేకులపల్లిలో..

టేకులపల్లి: మండలంలో కోయగూడెం, టేకులపల్లి, శాంతినగర్, సులానగర్ గ్రామాల్లో కురిసిన వర్షానికి కల్లాల్లో ఉంచిన మిర్చి తడిసింది. కొందరు రైతులు సకాలంలో టార్పాలిన్లు కప్పి మిర్చి పంటను కాపాడుకున్నారు.



టేకులపల్లి: శాంతినగర్లో తడిసిన మిర్చి

మద్యం తాగొద్దనడంతో వ్యక్తి ఆత్మహత్య

గుండాల: మద్యం తాగుతున్నావని మందిలించినందుకు ఓ వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆళ్లపల్లి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని కర్నిగూడెం గ్రామానికి చెందిన కొమరం నర్సింహారావు (40) నిత్యం మద్యం సేవిస్తూ ఇంటికి వస్తున్నాడు. గురువారం తన భార్య మద్యం ఎందుకు తాగుతున్నావని మందలించింది. మనస్తాపం చెందిన నర్సింహారావు పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నాడు. ఆళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

మణుగూరుటౌన్: మండలంలోని సమితిసింగారంలో కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. వేల్పుల విద్యాసాగర్ (33) కుటుంబ కలహాల నేపథ్యంలో గత నెల 29న పురుగులమందు తాగాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

రేషన్ బియ్యం పట్టివేత

అశ్వాపురం: మండలంలోని గొల్లగూడెం గ్రామంలో 25 క్వింటాళ్ల రేషన్బియ్యాన్ని అశ్వాపురం పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. గొల్లగూడెంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వంతెన వద్ద ఎస్ఐ రవూఫ్, సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా టాటా ఏస్ వాహనంలో మణుగూరు నుంచి పాల్వంచ తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యానిన పట్టుకున్నారు. వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

యువకుడిపై కేసు

పాల్వంచరూరల్: బాలిక బాత్రూమ్లో స్నానం చేస్తుంటే ఇంటి పక్కన ఉన్న యువకుడు కిటికీలో నుంచి చూస్తున్నాడనే ఫిర్యాదు మేరకు యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని కేశవాపురంలో గురువారం ఓ ఇంట్లోని బాత్రూమ్లో బాలిక స్నానం చేస్తుండగా పక్క ఇంటి కిటికీలో నుంచి బాలరాజు తొంగిచూడడంతో బాలిక కేకలు వేసింది. విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో బాలిక తల్లి ఫిర్యాదు మేరకు యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.

అడవికి నిప్పు.. నిర్లక్ష్యంతో ముప్పు

అశ్వారావుపేటరూరల్: వేసవి నేపథ్యంలో చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా పర్యావరణానికి, అటవీ సంపదకు తీరని ముప్పు వాటిల్లుతుంది. అశ్వారావుపేట ఫారెస్టు రేంజ్ పరిధిలోని ఊట్లపల్లి బీట్, వేదాంతపురం రిజర్వు ఫారెస్టులో ప్రధాన రహదారి పక్కనే మంటలు అంటుకున్నాయి. ఈ మంటలు చెలరేగుతూ, వ్యాపించడంతో ఫారెస్టులోని చెట్లు కాలిపోగా పొగ కారణంగా పర్యావరణానికి ముప్పు ఏర్పడింది. దట్టమైన పొగ కారణంగా ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే వాహనదారులు అవస్థలు పడాల్సి వచ్చింది. కాగా,



అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు

మంటల పట్ల అప్రమత్తంగా ఉండాల్సిన ఫారెస్టు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించి వాచర్లను పంపించి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

పోక్సో కేసు నమోదు

ఇల్లెందు: స్థానిక పోలీస్ స్టేషన్లో ఓ యువకుడిపై శుక్రవారం పోక్సో కేసు నమోదైంది. పట్టణానికి చెందిన బాలికను పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగికదాడి చేశాడని ఆమె తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్మీరాఖాన్పఠాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నలుగురు మావోయిస్టుల లొంగుబాటు

దుమ్ముగూడెం: ఛత్తీస్గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా ఎస్పీ కిరణ్చవాన్, సీఆర్పీఎఫ్ అధికారుల ఎదుట కమాండర్ సహా నలుగురు మావోయిస్టులు శుక్రవారం లొంగిపోయారు. పీఎల్జీఏ బెటాలియన్ అధిపతి బర్సే దేవా సోదరుడు బార్సే సన్నాతో పాటు మరో నలుగురు లొంగిపోయినట్లు అధికారులు చెప్పారు. దండకారణ్యంలో చోటుచేసుకున్న పలు విధ్వంసకర ఘటనల్లో వీరు పాల్గొన్నారని ఎస్పీ వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టుల్లో ఇద్దరిపై రూ.8 లక్షల రివార్డు ఉందని ఆయన పేర్కొన్నారు.



లొంగిపోయిన మావోయిస్టులతో ఎస్పీ, అధికారులు

ఇద్దరిపై కేసు

జూలూరుపాడు: మండల కేంద్రంలోని చికెన్ సెంటర్ నడుపుతున్న నిర్వాహకుడిని బెదిరించి, డబ్బులు డిమాండ్ చేసిన ఇద్దరు వ్యక్తులపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ బాదావత్ రవి కథనం ప్రకారం.. జూలూరుపాడులోని చంద్రుగొండ క్రాస్ రోడ్డు వద్ద గుండెపుడి గ్రామానికి చెందిన బోడా శ్రీను చికెన్ సెంటర్ నడుపుతున్నాడు. వెంగన్నపాలేనికి చెందిన తంబర్ల నరసింహారావు, జూలూరుపాడుకు చెందిన కంచెపోగు నరసింహారావు చికెన్ సెంటర్లోకి ప్రవేశించి విలేకరులమని చెప్పి సెల్ఫోన్తో వీడియోలు తీస్తూ, తమకు రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అడిగిన డబ్బులు ఇవ్వకపోతే చనిపోయిన కోళ్లు, రోగాలతో ఉన్న కోళ్లను అమ్ముతున్నట్లు పేపర్లలో రాయడంతోపాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి పేర్కొన్నారు.

బైక్ను ఢీకొన్న లారీ.. ఒకరు మృతి



ప్రశాంత్కుమార్ (ఫైల్)

దమ్మపేట: అతివేగంతో ప్రయాణిస్తున్న లారీ ఎదురుగా వస్తున్న బైక్ను ఢీకొట్టడంతో యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన మండలంలోని పట్వారిగూడెంశివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట అర్బన్కాలనీకి చెందిన గాజుబోయిన ప్రశాంత్కుమార్ (19) తాపీ పనిచేస్తుంటాడు. శుక్రవారం సొంత పనిమీద బైక్పై దమ్మపేట నుంచి కొత్తగూడెం వెళ్లి తిరిగి వస్తున్నాడు. మండలంలోని పట్వారిగూడెం శివారుకు రాగానే పాల్వంచ వైపుకు అతివేగంగా వెళ్తున్న లారీ బైక్ను బలంగా ఢీకొట్టింది. ప్రశాంత్కుమార్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి తల్లి, సోదరి ఉన్నారు. చేతికందిన కుమారుడి మృతితో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. మృతుడి తల్లి శాంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నామని ఎస్ఐ సాయికిశోర్రెడ్డి తెలిపారు.

తహసీల్లో పాము

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఓ పాము కలకలం రేపింది. ఎలుకను వేటాడుతూ వచ్చిన పామును గుర్తించిన ఉద్యోగులు బెంబేలెత్తిపోయారు. దీంతో కొత్తగూడెం మున్సిపాలిటీకి చెందిన స్నేక్ రెస్క్యూ సంతోష్కు సమాచారం ఇవ్వగా ఆయన చేరుకుని పామును బంధించారు. ఆ తర్వాత పామును అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు ఆయన తెలిపారు.



బంధించిన పాముతో సంతోష్

నవమి భక్తులకు ప్రత్యేక బస్సులు

- భద్రాచలానికి 197, అక్కడి నుండి పర్ణశాలకు 30
- హైదరాబాద్ భక్తులకు రిజర్వేషన్ కూడా..



ఖమ్మంమయూరిసెంటర్: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం, పట్టాభిషేకానికి హాజరయ్యే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ఖమ్మం రీజియన్ అధికారులు ప్రత్యేక సర్వీసులు నడిపించనున్నారు. ఈనెల 6, 7వ తేదీల్లో ఉమ్మడి జిల్లాలోని అన్ని డిపోల నుండి భద్రాచలానికి ఈ సర్వీసులు ఉంటాయి. అలాగే, హైదరాబాద్ నుండి భద్రాచలం, భద్రాచలం నుండి హైదరాబాద్కు సైతం బస్సులు ఏర్పాటు చేసి, రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇవి కాక ఖమ్మం నుండి హైదరాబాద్కు ప్రతీ పది నిమిషాలకో బస్సు నడిపించాలని నిర్ణయించారు. ఖమ్మం రీజియన్లోని డిపోల నుండి భద్రాచలానికి 197 ప్రత్యేక బస్సులు, భద్రాచలం నుండి పర్ణశాలకు 30 బస్సులు నడిపించనుండగా, భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా రీజియన్ మేనేజర్ ఏ.సరిరామ్ నేతృత్వాన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రోజు వారి సర్వీసులకు అదనం

భద్రాచలం నుండి హైదరాబాద్, భద్రాచలం నుండి ఖమ్మంకు రోజువారి తిరిగే వంద సర్వీసులతో పాటు అదనంగా సర్వీసులు నడిపిస్తారు. ఈనెల 6వ తేదీన అదనంగా 35సర్వీసులు, భద్రాచలం నుంచి కొత్తగూడెంకు నిత్యం తిరిగే సర్వీసులకు తోడు అదనంగా పది బస్సులు ఏర్పాటు చేయనున్నారు. అంతేకాక కొత్తగూడెం రైల్వే స్టేషన్ నుండి భద్రాచలానికి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఈ బస్సులు నడుస్తాయి. భద్రాచలం నుండి మణుగూరుకు రోజు వారీగా తిరిగే ఎనిమిది బస్సులతో పాటు అదనంగా పది బస్సులు, సత్తుపల్లి నుండి 20 బస్సులు, మధిర నుండి 17 బస్సులు, ఇల్లెందు నుండి భద్రాచలానికి ఐదు బస్సులు నడిపించనున్నారు. ఇక ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పలు కేంద్రాలకే కాక భద్రాచలం నుండి హనుమకొండ, కరీంనగర్కు సర్వీసులు ఏర్పాటు చేయాలనే యోచనలో అధికారులు ఉన్నారు. కాగా, భద్రాచలం నుండి విజయవాడ, రాజమండ్రి, గుంటూరు, ఏలూరు, కాకినాడ, అమలాపురం వైపు వెళ్లే బస్సుల కోసం జూనియర్ కాలేజ్ మైదానంలో ప్రత్యేక పాయింట్ ఏర్పాటుచేశారు. అక్కడి నుంచి ఆలయానికి వెళ్లేందుకు రెండు బస్సులు నడిపిస్తామని అధికారులు వెల్లడించారు.

ప్రత్యేక సర్వీసుల సమాచారం కోసం ఫోన్ నంబర్లు

డిపో	సెల్ నంబర్
భద్రాచలం	99592 25987
ఖమ్మం కొత్త బస్టాండ్	99592 25979
మణుగూరు	89853 61796
కొత్తగూడెం	99592 25982

ప్రయాణికులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు



శ్రీరామనవమి పురస్కరించుకుని భద్రాచలంలో స్వామివారి కల్యాణం తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు వస్తారు. రాకపోకల సమయాన ఎవరూ ఇబ్బంది పడకుండా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల నుండి ప్రత్యేక బస్సులు నడిపిస్తాం. ఈనెల 6న భక్తుల కోసం అన్ని బస్టాండ్ల నుండి రద్దీకి అనుగుణంగా బస్సులు ఉంటాయి. అంతేకాక భద్రాచలం నుంచి ఖమ్మం, హైదరాబాద్కు రెగ్యులర్ సర్వీసులు తోడు అదనపు సర్వీసులు నడిపిస్తాం.

– ఏ.సరిరామ్, ఆర్ఎం, ఖమ్మం రీజియన్

ఏపీ గెలలకూ ఓఈఆర్ 19.36 శాతం..

- అశ్వారావుపేటలో పరీక్షించాక నిర్ధారణ
- జగన్ హయాంలో మాదిరి టన్ను ధర చెల్లించక తప్పని పరిస్థితి



అశ్వారావుపేటరూరల్: ఏపీలో రైతులు సాగుచేస్తున్న ఆయిల్పామ్ గెలల ఓఈఆర్ (నూనె దిగుబడి శాతం) 19.36 శాతంగా నమోదవడంతో ఆ ప్రకారం వారికి ధర చెల్లించనున్నారు. ఏపీలోని ఆయిల్ఫెడ్కు చెందిన పామాయిల్ ఫ్యాక్టరీలు పాతవి కావడంతో నూనె దిగుబడి శాతం కేవలం 17.30గా నమోదవుతోంది. తెలంగాణలో మాత్రం ఇది 19.36 శాతం ఉండడంతో రైతులకు టన్ను గెలలకు రూ.21 వేల చొప్పున, ఏపీ రైతులకు రూ.17 నుంచి రూ.18 వేల మధ్యే అందుతోంది. ఏపీ సీఎంగా వైఎస్.జగన్మోహన్రెడ్డి ఉన్నప్పుడు తెలంగాణ ఆయిల్ఫెడ్ నిర్ణయించే ఓఈఆర్ ప్రకారమే ఐదేళ్ల పాటు ధర చెల్లించారు. కానీ, కూటమి ప్రభుత్వం వచ్చాక ఏపీ ఓఈఆర్ ప్రకారమే టన్ను ధర చెల్లించేలా నిర్ణయించగా రైతులకు నష్టం ఎదురవుతోంది. ఈ మేరకు రైతుల వినతితో ఏపీ గెలలను అశ్వారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో క్రషింగ్ చేసి ఓఈఆర్ శాతాన్ని నిర్ధారించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని ఏపీ ప్రభుత్వం కోరింది. దీంతో ఏపీలో రైతులు సాగు చేసిన 862 టన్నుల గెలలను బుధ, గురువారం క్రషింగ్ చేయగా 19.36 శాతంగా ఓఈఆర్ నమోదైనట్లు ఫ్యాక్టరీ మేనేజర్ నాగబాబు శుక్రవారం ప్రకటించారు. ఈ ఓఈఆర్ ప్రకారం ఏపీ రైతులకు ధర చెల్లించనుండగా టన్నుకు రూ.3 వేలకు పైగా లబ్ధి జరగనుంది. కాగా, గెలల క్రషింగ్ అవకాశం కల్పించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆయిల్ఫెడ్ ఎండీ యాస్మిన్బాషా, అధికారులకు ఏపీ రైతు సంఘం నాయకులు బొబ్బా రాఘవరావు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇల్లు దగ్ధం

ములకలపల్లి: ఓ ఇల్లు అగ్ని ప్రమాదానికి గురై దగ్ధమైన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని పూసుగూడెం గ్రామానికి చెందిర చల్లా కుమారి, రామకృష్ణ.. దంపతులు శుక్రవారం ములకలపల్లికి కూలీకి వెళ్లారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇంటికి మంటలు అంటుకున్నాయి. స్థానికులు ఇంట్లోని గ్యాస్ సిలిండర్ను బయటకు తీసుకొచ్చారు. గృహోపకరణాలు, 3 తులాల బంగారు, వెండి పట్టీలు, ఇటీవల డ్వాక్రాలో తీసుకున్న రుణం రూ.లక్ష నగదు దగ్ధమయ్యాయని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. కాగా, ఘటనా స్థలాన్ని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సందర్శించారు. రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని భరోసా ఇచ్చారు. గిర్దావర్–1 సత్యావతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్రావు, బత్తుల అంజి, పత్తీలాల్, తిరుపతిరెడ్డి, రాంబాబు, అవినాశ్, రవి తదితరులు ఉన్నారు.



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ